సాక్షి విశాఖపట్నం

శనివారం, 19, అక్టోబర్, 2024

ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి

ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్‌గా బొత్స సత్యనారాయణ





సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా వి.విజయసాయిరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్‌గా నియమించారు.



సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాశ్యామ్ రాథో దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

ఆర్మీ జవాన్ భౌతికకాయానికి నివాళి

నేడు పరవాడపాలెంలో అంత్యక్రియలు



జవాన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నేవీ అధికారి

ఎంవీపీకాలనీ: ఇండియన్ ఆర్మీ జవాన్ పరవాడ నాయుడుబాబు భౌతిక కాయానికి విశాఖ ఎయిర్‌పోర్టులో ఘననివాళులర్పించారు. లేహ్ సెక్షన్‌లోని కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్ రెజిమెంట్‌లో (873 ఇంజినీర్ వర్క్స్) నాయుడుబాబు ఇండియన్ ఆర్మీకి సేవలు అందిస్తున్నారు. ఇటీవల ఆయన మృతి చెందారు. శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్టుకు ఆయన మృతదేహాన్ని తీసుకొచ్చారు. నేవీకి చెందిన సెరిమోనియల్ గార్డ్‌తో పాటు తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ డేగా కమాండింగ్ ఆఫీసర్ కండోర్ మనోజ్ యాదవ్, స్టేషన్ హెచ్‌క్యూ (ఆర్మీ) కల్నల్ విక్రాంత్ పాండే, నగర పోలీసులు అధికారులు నాయుడు భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. కశింకోటలోని పరవాడపాలెం గ్రామంలో శనివారం నాయుడుబాబు అంత్యక్రియలు ప్రభుత్వ, సైనిక లాంఛనాలతో జరగనున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్‌తో ప్రయోజనం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్


మహారాణిపేట: జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, ఇతర ఉత్పత్తిదారులు డిజిటల్ మార్కెటింగ్ విధానాలను అనుసరించి మరిన్ని ప్రయోజనాలు పొందాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్ ఫాంలో అందరూ చేరాలని చెప్పారు. ఈ కామర్స్ విధానాలకు పెద్దపీట వేస్తూ విక్రయదారులకు, కొనుగోలు దారులకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమలు, ఉత్పత్తుల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు తీసుకున్న చర్యలపై ముందుగా కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఆర్డీవో పి. శ్రీలేఖ, జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం.వి. ఆదిశేషు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా అప్పలనాయుడు



అల్లిపురం: ఏపీఎస్ ఆర్టీసీ, జోన్–1, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా బి.అప్పలనాయుడు, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారిగా అదనపు బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఇప్పటి వరకు జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేసిన ఏ అప్పలరాజు ఇంచార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా, విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని, ఆర్టీసీ అభివృద్ధి కృషి చేస్తానన్నారు.

65 మంది పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీస్ అధికారులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక ప్రారంభించారు. ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు, కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు 65 మంది రక్తదానం చేశారు. సేకరించిన 65 యూనిట్ల రక్తాన్ని ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. రక్తదానం చేసిన పోలీసులకు ఎస్పీ దీపిక ప్రశంసాపత్రాలు అందించారు. ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలని సూచించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పర్యాటక విద్య ప్రాప్తిరస్తు

పర్యాటక రంగంలో విజ్ఞాన కేంద్రాలను విద్యార్థులందరికీ అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో, జిల్లా పర్యాటక సంస్థ జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలు, స్కూల్స్ విద్యార్థులందరికీ ఎడ్యుకేషనల్ పర్యటనను రూపొందించింది. విజ్ఞానాత్మక కేంద్రాలను విద్యార్థులకు చేరువ చేస్తున్నారు. ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా విద్యార్థుల్లో మరింత విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో టూరిజం అధికారులు వినూత్న విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వివిధ మార్గాల ద్వారా ఎడ్యుకేషనల్ టూరిజంపై విద్యార్థుల్లో చైతన్యం నింపాలని భావిస్తున్నారు.

- టూరిజం స్పాట్స్ నుంచి విద్యావగాహన
- జిల్లా పర్యాటక అధికారుల వినూత్న ఆలోచన
- పర్యాటక ప్రాంతాల్లో నేటి నుంచి ఎడ్యుకేషనల్ టూర్స్
- ప్రభుత్వ బడులు, కాలేజీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం
- ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలకు ప్రవేశరుసుం రూ.10 మాత్రమే
- మెరైన్, జీవ వైవిధ్యం, తీర పర్యావరణ విభాగాల్లో అవగాహన

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి చెప్పే పాఠాలే.. విద్యార్థి భవిష్యత్తుకు దిక్సూచీగా నిలుస్తాయి. బడిలో చెప్పిన చదువు.. పర్యావరణంలో అన్వేషిస్తే.. ఆ పాఠం జీవితాంతం గుర్తుండిపోతుంది. అందుకే విద్యను పర్యాటకంతో మమేకం చేస్తూ జిల్లా టూరిజం అధికారులు వినూత్న ఒరవడికి తెరతీశారు. పర్యాటక ప్రాంతాల్లో ఎడ్యుకేషనల్ టూర్స్‌కు శ్రీకారం చుట్టారు. స్కూల్స్, కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న వారికి మూడు విభాగాల్లో అవగాహన కల్పించేలా ఎడ్యుకేషన్ టూరిజం ఐటెనెరరీ పేరుతో కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించనున్నారు.



'ప్రభుత్వ' విద్యార్థులకు ఫ్రీ


జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యాసానికి పనికొచ్చే ప్రాంతాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో విద్యార్థులకు రాయితీతో కూడిన ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు కేవలం రూ.10 టికెట్‌తో ప్రవేశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు.

ట్రిపుల్ 'యాత్ర'

విద్యార్థులకు సంబంధించి ఎడ్యుకేషన్ టూరిజం ఐటెనెరరీ మూడు విభాగాలుగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అవేంటంటే...

1 మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషనల్ టూర్

ఈ టూర్‌లో భాగంగా సాగరతీరం**లో ఉన్న పర్యాటక ప్రాం**తాలను సందర్శించ**వచ్చు. సీ హారియర్ మ్యూ**జియం, **టీయూ–142, ఐఎన్ఎస్** కురుసుర సబ్‌మె**రైన్, మారీటైమ్ మ్యూజి**యంలను **విద్యార్థులు సందర్శిస్తారు**. అనంతరం **అక్కడి నుంచి టైడ్‌పూలిం**గ్‌కు వెళ్లేలా ప్రణా**ళికలు రూపొందించారు**. సముద్ర తీరంలో **ముఖ్యంగా ఆర్కేబీచ్,** సాగర్‌నగర్ తీరాల్లోని రాళ్లు, ఒడ్డున ఉన్న సముద్ర జీవుల అన్వేషిస్తారు. ఈ యాత్ర ద్వారా చరిత్ర, జీవావరణ శాస్త్రంపై అధ్యయనం చేసినట్లుగా జ్ఞానాన్ని సముపార్జించే అవకాశం లభిస్తుంది.




2 జీవవైవిధ్య విద్యా పర్యటన

ఈ పర్యటనలో భాగంగా పర్యావరణంలో ఉన్న జీవరాశుల అధ్యయనాన్ని అన్వేషించే అవకాశం లభిస్తుంది. ముందుగా ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్‌ను సందర్శించి, అక్కడి నుంచి కాపులుప్పాడ సమీపంలో ఉన్న బయోడైవర్సిటీ పార్క్‌లో ఉన్న పర్యావరణ వ్యవస్థను పరిశీలిస్తారు. జీవవైవిధ్య కేంద్రానికి చిరునామాగా ఉన్న తూర్పు కనుమలలో కనిపించే ప్రత్యేకమైన జీవవైవిధ్య పరిరక్షణ, అధ్యయనంపై విద్యార్థులకు అద్భుతమైన పాఠాలు అందించే కేంద్రాలివి. వీటన్నింటి కంటే దట్టమైన కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో కొన్ని ట్రెక్కింగ్ అనుభవాలను కూడా విద్యార్థులు సొంతం చేసుకోవచ్చు.



3 తీర పర్యావరణ వ్యవస్థ యాత్ర

ఇందులో భాగంగా.. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న జీవశాస్త్ర ప్రయోగశాలని విద్యార్థులు సందర్శించవచ్చు. ఎఫ్ఆర్‌సీసీఈ మడ అడవుల పరిశోధన కేంద్రం, ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియంకి వెళ్లే అవకాశం కలుగుతుంది. ఈ యాత్ర ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఆయా జీవులు ఏవిధంగా దోహద పడుతుంటాయి.. ప్రకృతి ప్రశాంతంగా ఉండాలంటే వాటిని ఎలా కాపాడుకోవాలనే అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ఈ యాత్రలో భాగంగా తీర ప్రాంత పరిశోధనలకు సంబంధించి మెరైన్ లైవ్ వాక్ కూడా అనుసంధానం చేస్తున్నారు.





ప్రాథమిక స్థాయి నుంచి అవగాహన



పర్యావరణంతో మమేకమవుతూ జ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు విద్యార్థులకు వీఎంఆర్‌డీఏతో కలిసి టూరిజం శాఖ అందిస్తున్న గొప్ప అవకాశం ఇది. ఇప్పటికే ఎడ్యుకేషనల్ టూరిజం ఐటినరీకి సంబంధించిన బ్రోచర్లను ఆంధ్ర యూనివర్సిటీ, డిగ్రీ కళాశాలలకు, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు, జిల్లా విద్యాశాఖకు అందజేశాం. జిల్లాలో గల అన్ని విద్యాసంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులకు పర్యావరణ విద్య తో పాటు లెర్నింగ్ స్కిల్స్ డెవలప్ అయ్యేందుకు కృషి చెయ్యాలని కోరుతున్నాం. జిల్లాలోని ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యా సంస్థలు భాగస్వామ్యం అయ్యేలా కార్యాచరణ రూపొందించాం.

– జ్ఞానవేణి, జిల్లా పర్యాటక అధికారి

విద్యుత్ భారంపై ప్రజా ఉద్యమం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంగారావు
- ఏపీఈపీడీసీఎల్ వద్ద ధర్నా

సీతమ్మధార : ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చాక 120 రోజులకే విద్యుత్ ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8,114 కోట్లు భారం మోపడం తగదని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు పేర్కొన్నారు. వీటిని తక్షణమే రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త ధర్నాలకు సీపీఎం పిలుపునివ్వడంతో శుక్రవారం విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ మేం అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా ప్రజలపై భారం వేయబోమని స్పష్టం చేశారని, అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. వచ్చే ఏడాది కూడా మరో రూ.11,700 కోట్లు భారం వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు, సిమెంట్, ఇసుక, ఐరన్‌, ఆయిల్ వంటి ధరలు పెంచడమేనా కూటమి పాలన అని నిలదీశారు. మోదీ తెచ్చిన విద్యుత్ సంస్కరణలు 2020 చట్టానికి నాడు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మద్దతుగా నిలిచారా లేదా ప్రజలకు తెలియజేయాలన్నారు. 2021–22 సంవత్సరాల్లో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు భారాలు మోపడమేమిటని ప్రశ్నించారు. సీఐటీయూ నేత ఆర్.కే.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకమని, ఎక్కడైనా స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండని గతంలో లోకేష్ పాదయాత్ర సందర్భంగా పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లలను రద్దు చేస్తారా? అమలు చేస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుంచి 15 వరకు ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ధర్నాలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పి.మణి, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, ఎం.చంటి, యు.ఎస్.యన్‌రాజు, జి.అప్పలరాజు, పి.వెంకటరావు, చంద్రశేఖర్, ఎం.సూరీడు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఆహార ప్రియులకు శుభవార్త

రాత్రి 12 గంటల వరకు వ్యాపారాలకు అనుమతి

అల్లిపురం: ఆహార ప్రియులకు నగర పోలీస్ కమిషనర్ శుభవార్త చెప్పారు. ఇకపై అర్ధరాత్రి వరకూ నగరంలో హోటల్స్, రెస్టారెంట్స్, ఇతర తినుబండారాలు అమ్మే దుకాణాలు తెరిచే ఉంటాయి. అర్ధరాత్రి అయినా ఆహారం కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేదని నగర పోలీసులు చెబుతున్నారు. వ్యాపారులు నిరభ్యంతరంగా వ్యాపారాలు కొనసాగించవచ్చు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం హోటల్స్, రెస్టారెంట్స్, ఇతర తినుబండారాలు అమ్మే వారికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. బార్ అండ్ రెస్టారెంట్స్ మాత్రం యాథావిధిగా రాత్రి 10.30 గంటలకు మూసివేయాలని స్పష్టం చేశారు.

'ఆడుదాం ఆంధ్రా' తిరస్కరణ

- కాంట్రాక్టర్ నుంచి కమీషన్ రాలేదనేనా..?
- 'సాక్షి' చెప్పినట్లుగానే స్థాయీ సంఘం సమావేశంలో నిర్ణయం

విశాఖ సిటీ: 'ఆడుదాం ఆంధ్రా' కాంట్రాక్టర్‌కు అనుకున్నట్లుగానే స్థాయీ సంఘ సభ్యులు చుక్కలు చూపిస్తున్నారు. పనులు పూర్తి చేసినప్పటికీ.. కాంట్రాక్టర్ నుంచి కమీషన్ రాలేదన్న అక్కసుతో నిధుల విడుదలకు మోకాలడ్డారు. ఈ విషయాన్ని 'సాక్షి' ముందే చెప్పింది. కమీషన్ రాకపోవడంతో స్థాయీ సంఘం సమావేశంలో ఆడుదాం ఆంధ్రా అంశాన్ని తిరస్కరించాలని నిర్ణయించినట్లు సాక్షి ముందే కథనాన్ని ప్రచురించింది. ఇందుకు తగ్గట్టుగానే శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీలో ఈ అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. దీనిపై కాంట్రాక్టర్లు భగ్గుమంటున్నారు. టీడీపీ కార్పొరేటర్ల కమీషన్ల వ్యవహారానికి ప్రభుత్వ పెద్ద దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. పనులు పూర్తి చేసినప్పటికీ.. కమీషన్ల కోసం ఇబ్బందులకు గురి చేయడం సరికాదని వాపోతున్నారు.

పీలా గోల.. : జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్ సహచర కార్పొరేటర్లు కారాలు మిరియాలు నూరుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల ఆరోపణల వ్యవహారం పీలాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కమీషన్ల వ్యవహారం ఆయన మెడకు చుట్టుకునే పరిస్థితులు ఉండడంతో ఆయన స్వపక్ష కార్పొరేటర్లపైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తన సహచర కార్పొరేటర్లే తనపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మేయర్ మార్పుపై తీవ్ర చర్చ నెలకొంది. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దింపేయడానికి తెరవెనుక పావులు కదిపారు. టీడీపీ నుంచి ఫ్లోరలీడర్ పీలా శ్రీనివాసే కాబోయే మేయర్ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే నిబంధనల ప్రకారం నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే అవకాశం లేదని తెలుసుకున్న తరువాత ప్రయత్నాలను తాత్కాలికంగా విరమించారు. అయినప్పటికీ.. టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్ ప్రస్తుతం షాడో మేయర్ తరహాలో వ్యవహరిస్తున్నారన్న టాక్ నడుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా టీడీపీ కార్పొరేటర్లే అంగీకరిస్తుండడం విశేషం. జీవీఎంసీలో పీలా పెత్తనం చెలాయిస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఈ క్రమంలో కాంట్రాక్టుల విషయంలో టీడీపీ కార్పొరేటర్ల వ్యవహార శైలి ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రధానంగా పీలా కాంట్రాక్టర్లకు కమీషన్ ఫిక్స్ చేశారన్న వార్తలు చర్చనీయాంశమవుతోంది. ఈ వ్యవహారంపై జీవీఎంసీలో దుమారం రేగడంతో విషయం టీడీపీ పెద్దల దృష్టికి వెళ్లింది. అలాగే కొంత మంది కాంట్రాక్టర్లు కూడా టీడీపీ ఎమ్మెల్యేలనే కాకుండా బీజేపీ ఎమ్మెల్యేను కూడా కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. రోజు రోజుకు ఈ కమీషన్ల వ్యవహారం ముదురి పీలా శ్రీనివాస్ మెడకు చుట్టుకుంటోంది. దీనిపై ఆయన మల్లగుల్లాలు పడుతున్నారు.

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు..!

జీవీఎంసీలో కమీషన్ల వ్యవహారంపై కూటమి నేతలు మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం విశాఖ పర్యటనలో ఉన్న లోకేష్‌ను కలిసిన నేతలు కార్పొరేటర్లు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జీవీఎంసీ టీడీపీ కార్పొరేటర్లపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఇది పార్టీకి మంచిది కాదని చెప్పినట్లు తెలిసింది. దీనిపై లోకేష్ కూడా కొంత సీరియస్‌గానే స్పందించినట్లు సమాచారం.

అభివృద్ధి పనులకు 'స్థాయీ సంఘం' ఆమోదం



సమావేశంలో పాల్గొన్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, స్థాయీ సంఘం సభ్యులు

అల్లిపురం: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జీవీఎంసీ స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘం సమావేశ మందిరంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 85 అంశాలను అజెండాలో పొందుపరిచారన్నారు. వాటిని సభ్యులు చర్చించిన అనంతరం 8 అంశాలు వాయిదా వేశామన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.6.04 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.2.45 కోట్లు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, మురళీకృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణరాజు, సహాయక వైద్యాధికారి సునీల్‌కుమార్, బయాలజిస్టు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త అర్జునరావు మృతికి సంతాపం


అర్జునరావు (ఫైల్)

గాజువాక: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఏవీకే ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు పంపన అర్జునరావు (77) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుమారుడు పంపన త్రినాథ్ తెలిపారు. గాయత్రీ ఫ్యాబ్రికేషన్స్, ప్రభ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, విద్య, వ్యాపార రంగాల్లో ఎంతోమందికి అర్జునరావు ఉపాధి మార్గం చూపించారు. సామాజిక, రాజకీయరంగాల్లో సేవలు అందించి పలువురి మన్ననలు అందుకున్నారు. ఆయన పార్థివ దేహాన్ని తోకాడలోని స్వగృహానికి శుక్రవారం తీసుకొచ్చారు. శనివారం ఉదయం అంతిమయాత్ర నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్జునరావుకు నివాళులర్పించిన వారిలో కె.గోవిందరావు, టిప్‌టాప్ ప్రసాదరావు, కె.వెంకటేశ్వర్లు, డి.తిరుమలరావు, జి.శంకరరావు తదితరులున్నారు.

అద్భుత ఆలోచనలు.. వినూత్న ఆవిష్కరణలు

చిట్టి బుర్రలు అద్భుతాలు సృష్టించాయి. మన చుట్టూ ఉన్న సమస్యలే వారిని ఆలోచింపజేశాయి. వాటికి పరిష్కార మార్గాలను చూపించేలా ఆవిష్కరణల వైపు నడిపించాయి. విద్యార్థులు సరికొత్త ప్రాజెక్టులు రూపకల్పన చేసి ఔరా అనిపించారు. రెండు జిల్లాల సైన్స్ ఫెయిర్ వేదికగా ప్రదర్శించిన వీరి నమూనాలు వీక్షకులను అబ్బురపరిచాయి.

- ఆలోచింపజేసిన ప్రాజెక్ట్‌లు
- కొక్కిరాపల్లి గురుకులంలో రెండు జిల్లాల స్థాయి సైన్స్ ఫెయిర్
- ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

యలమంచిలి రూరల్: అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సైన్స్ ఫెయిర్‌లో బాలబాలికలు అందరినీ ఆలోచింపజేసేలా ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు. కొక్కిరాపల్లి గురుకులంలో శుక్రవారం జరిగిన సైన్స్ ఫెయిర్‌లో తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచి అబ్బురపరిచారు. కమ్యూనిటీ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్, పర్యావరణ అంశాలు, జాతీయ మానవ వనరులు, మాన వాళి మనుగడ, ఆరోగ్యం, ప్రజల శ్రేయస్సు, స్వచ్ఛమైన నీ రు, పారిశుధ్యం, సేంద్రియ వ్యవసాయం, రోడ్డు ప్రమాదాలు, ఫార్మా ప్రమాదాల సేఫ్టీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మొత్తం 116 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వారికి గైడ్ టీచర్లు కావాల్సిన సూచనలిస్తూ ప్రోత్సహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించిన అనంతరం నమూనాలను జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపవతి, ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డీడీ రాజేశ్వరి తిలకించారు. కొక్కిరాపల్లి, మేహాద్రిగెడ్డ, సబ్బవరం గురుకులాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, అవి సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగపడతాయో వారు వివరించే తీరును జేసీ ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

చెత్త వేరు చేస్తే రివార్డు పాయింట్లు

'ప్రాణాంతక డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులను కలుగజేసే దోమల వ్యాప్తికి డ్రైనేజీల్లో మురుగునీరే ప్రధాన కారణం. చాలా చోట్ల డ్రైనేజీల్లో మురుగు రహదారులపై పారుతుంటుంది. దీనిని పరిష్కరించేందుకు సఫాయి మిత్ర పేరుతో డ్రైనేజీల్లో మురుగు పరిమితికి మించి పారినప్పుడు ఒక సెన్సార్‌తో కూడిన ప్రత్యేక వ్యవస్థ ద్వారా మున్సిపల్ అధికారులను అప్రమత్తం చేసేలా సబ్బవరం గురుకులం 9వ తరగతి విద్యార్థులు జె. సందీప్, వి. విజయ్‌కుమార్ ఒక ప్రాజెక్ట్ రూపొదించారు. అదే గురుకులానికి చెందిన విద్యార్థులు ఆర్.లక్ష్మీనరసింహ, టి.రాంబాబు స్వచ్ఛ జీవన్ పేరుతో తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను వేర్వేరుగా చెత్త డబ్బాల్లో వేసిన వారికి రివార్డు పాయింట్లు ఇవ్వడం అనే కొత్త కాన్సెప్టును రూపొందించారు.


సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు తిలకిస్తున్న అనకాపల్లి జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు

ప్రమాదం జరిగితే అప్రమత్తం చేస్తుంది


మేహాద్రి గెడ్డ విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు

ఇటీవల దేశంలో, రాష్ట్రంలో పలుచోట్ల ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు మేహాద్రిగెడ్డ గురుకులం విద్యార్థినులు కె. లోహిత, వై.హిమబిందు ఆటోమేటెడ్ సేఫ్టీ మానిటరింగ్ అండ్ యాక్సిడెంట్ అలర్ట్ సిస్టమ్‌ను రూపొందించారు. ఫార్మా కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగేటపుడు ఈ వ్యవస్థ అందర్నీ అప్రమత్తం చేస్తుందని వారు తెలిపారు.

ఫ్లోటెడ్ హోం ప్రాజెక్టు



పట్టణాలు, నగరాల్లో భారీగా వరదలు వచ్చినప్పుడు ఆటోమేటిక్ హైడ్రాలిక్ వ్యవస్థతో భవనాలు ఎత్తు పెరిగి ధన, ప్రాణ నష్టం తగ్గేలా వినూత్నమైన ప్రాజెక్టు రూపొందించారు శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు పి.శివకృష్ణ, కె.లోకేష్..

స్మార్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు



'భూమిలో తేమ శాతాన్ని బట్టి వ్యవసాయానికి అవసరమైన నీరు విడుదలయ్యేలా స్మార్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తాళ్లపాలెం గురుకులం విద్యార్థినులు రూపొందించారు.

వరదలు అరికట్టేలా..



'హైడ్రాలిక్ మిస్సైల్ లాంచింగ్ ప్రాజెక్టును మేహాద్రిగెడ్డ గురుకులం 10వ తరగతి విద్యార్థినులు పి.లావణ్య, టి.నీరజ తయారు చేశారు. రిజర్వాయర్ల వద్ద నీటి ప్రవాహాన్ని నియంత్రించడం ద్వారా వరదలను అరికట్టేలా ఈ నమూనా రూపొందించారు.

హజ్ యాత్రికుల ఆశలపై 'కూటమి' నీళ్లు

- హజ్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్

గాజువాక: జీవితంలో ఒక్కసారైనా పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లాలన్న ముస్లింల కోరికను కూటమి ప్రభుత్వం కలగా మిగిల్చేలా ఉందని రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. హజ్ యాత్రికులు విజయవాడ విమానాశ్రయం నుంచి వెళ్లే విధంగా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో ఎంబార్కేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేశారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి సాధించిన ఘనతను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. గత హజ్ యాత్రలో భాగంగా 2,873 మంది యాత్రికులకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.14.04 కోట్లు నిధులు కేటాయించడమే కాకుండా వివిధ ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి బయల్దేరిన వారికి కూడా ఆర్థికంగా చేయూతనిచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం గత హజ్ యాత్రకు సంబంధించిన బిల్లును కూడా ఆలస్యం చేస్తోందన్నారు. యాత్రికులు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా కాలయాపన చేస్తోందన్నారు. ఈ ఏడాది యాత్రకు 1,797 మంది యాత్రికులు విజయవాడ నుంచి నేరుగా మక్కాకు వెళ్లే పరిస్థితి లేదని, దీంతో హైదరాబాద్, బెంగళూరు నుంచి దరఖాస్తు చేసుకునే స్థితికి చంద్రబాబు, మంత్రి ఫరూఖ్ తీసుకొచ్చారని మండిపడ్డారు.

బాల్యం విద్యార్థినులకు జాతీయ స్థాయి అవార్డులు



జీవీఎంసీ బాల్యం విద్యా కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థినులకు న్యూఢిల్లీ నుంచి చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ నిర్వహించిన లైవ్ కాంపిటీషన్‌లో మూడు జాతీయ స్థాయి అవార్డులు పొందారు. వీరిని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ అభినందించారు. – అల్లిపురం

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

- రాజమహేంద్రవరం డీపీవో, ఎస్ఎస్ఏ పూర్వ పీవో అంత్యక్రియలు పూర్తి

అగనంపూడి: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన కూర్మన్నపాలెంలో శుక్రవారం జరిగింది. విశాఖ జిల్లా సర్వ శిక్ష అభియాన్ పూర్వ ప్రాజెక్టు అధికారి, ప్రస్తుత రాజమహేంద్రవరం జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) బొబ్బరాడ శ్రీనివాసరావు గురువారం గుండెపోటుతో అకాల మరణం పొందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గురువారం సాయంత్రం కూర్మన్నపాలెంలోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. జిల్లా అధికారులు, సన్నిహితులు, బంధువులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కూర్మన్నపాలెంలోని కైలాసభూమిలో శుక్రవారం ఉదయం ఆయన అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా.. శ్రీనివాసరావు పెద్ద కుమార్తె డెంటిస్ట్ శ్రావ్య తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టారు. హైందవ సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం సాధారణంగా తండ్రి లేదా కుమారులు, అన్నదమ్ములు అంతిమ సంస్కారాలు పూర్తి చేస్తారు. అయితే శ్రీనివాసరావుకు ఇద్దరూ కుమార్తెలే కావడంతో.. పెద్ద కుమార్తె తలకొరివి పెట్టడానికి ముందుకొచ్చారు. శ్రీనివాసరావు సోదరుడు, విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి సత్యప్రసాద్ దగ్గరుండి ఈ తంతును పూర్తి చేయించారు.

శ్రీనివాసరావు మృతి బాధాకరం


శ్రీనివాసరావు మృతిపై సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్సీ రవీంద్ర బాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఎస్ఎస్ఏ పూర్వ పీవో బి.శ్రీనివాసరావు మృతి బాధాకరమని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి.. నిర్దేశిత కాలంలో లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం సాయంత్రం జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో భాగంగా శ్రీనివాసరావు మృతికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్సీ పండుల రవీంద్ర బాబు, సీపీ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాల విక్రయం

- నలుగురి అరెస్ట్

అల్లిపురం: నిరుద్యోగులు, విద్యార్థుల నుంచి బ్యాంకు ఖాతాలను సేకరించి.. అక్రమ నగదు లావాదేవీలకు సైబర్ నేరగాళ్లకు అమ్ముకొని డబ్బులు సంపాదిస్తున్న నలుగురిని సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితులు నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని, వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని, అధిక మొత్తంలో డబ్బులు కూడా ఇస్తామని నమ్మబలుకుతారు. వారి ఆధార్ కార్డుల్లోని వివరాలను మార్చి, పాన్ కార్డులకు అప్లై చేయించి, వారి తెలియకుండా వివిధ డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకుంటారు. ఆ తర్వాత బాధితుల పేరుతో కార్పొరేట్, కరెంట్ ఖాతాలను తెరిచి, వాటిని సైబర్ నేరాలకు ఉపయోగిస్తారు. ఈ విధంగా మూడు కార్పొరేట్, 2 కరెంట్ ఖాతాలను ఓపెన్ చేయించి.. తద్వారా మోసం చేస్తున్న బొండా వెంకట శివసాయి, ముడికి యాదేశ్ కుమార్ అలియాస్ విక్కీ, సిర్రా ప్రదీప్‌కుమార్, సింగంశెట్టి సాయిబాబులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా ఈ ఖాతాల ద్వారా ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, గుజరాత్, కర్నాటక, బిహార్, హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, చత్తీస్‌గఢ్ తదితర 17 రాష్ట్రాల్లో 50 సైబర్ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. సుమారు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్ల లావాదేవీలు జరిగాయని పోలీసులు తెలిపారు. ఇందుకు గానూ నిందితులు హవాలా ద్వారా డబ్బులు తీసుకున్నారు. ఈ ఖాతాలను ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలకు ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కార్పొరేట్ ఖాతాలు భవాని ఫిషింగ్ ఆక్వా(లాసన్స్ బే కాలనీ ఎస్‌బీఐ), బాలాజీ ఫిషింగ్ ఆక్వా(మురళీనగర్ ఎస్‌బీఐ), గణేష్ ఫిషింగ్ ట్రేడర్స్(వన్‌టౌన్ ఏరియా), కరెంట్ ఖాతాలు నాని సీ ఫుడ్స్(పెదవాల్తేరు, సాగర్ ఎస్‌బీఐ బ్రాంచ్) పేరిట ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫేక్ బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేసి మోసగాళ్లకు ఇస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నిరుద్యోగులను హెచ్చరించారు.

'మైగ్రేన్ తలనొప్పిని తేలికగా తీసుకోవద్దు'


జర్మనీకి చెందిన డాక్టర్ హన్నాకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ గోపి

మహారాణిపేట: మైగ్రేన్ తలనొప్పిని తేలికగా తీసుకోవద్దని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ జాతీయ అధ్యక్షుడు దేబాశిష్ చౌదరి హెచ్చరించారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన నేషనల్ న్యూరాలజీ కాన్ఫరెన్స్-2024లో భాగంగా మైగ్రేన్ తలనొప్పి అనే అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఇదే కాన్ఫరెన్స్‌లో మూర్ఛ రోగుల చికిత్సపై కెనడాకు చెందిన డాక్టర్ రాజేష్ నాయర్, న్యూరోనల్ నెట్‌వర్క్‌లపై నిరోధక న్యూరాన్ల నియంత్రణ అనే అంశంపై జర్మనీకి చెందిన డాక్టర్ హన్నా మోనియర్, డాక్టర్ బల్దేవ్ సింగ్ ప్రసంగించారు. అల్పాహార సెషన్లలో న్యూరాలజీకి సంబంధించిన వివిధ అంశాలపై న్యూరాలజిస్టులు, అధ్యాపకులు తమ పరిశోధన పత్రాలను ప్రదర్శించారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

విశాఖ లీగల్ : అగ్నిసాక్షిగా వివాహం చేసుకొని, ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష రూ. 85,000 జరిమానా విధిస్తూ నగరంలోని 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ అందించిన వివరాలు.. నిందితుడు భోగిరాజు వైకుంఠరావు (46) నగరంలోని గోపాలపట్నం దరి ఎల్లపువానిపాలెంలో ఉండేవాడు. అతనికి తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా భీమవరం గ్రామానికి చెందిన గాయత్రి (43)తో 2015లో వివాహం జరిగింది. వివాహ సమయంలో గాయత్రి తల్లిదండ్రులు రూ.30,000 కట్నం, రెండున్నర తులాలు బంగారం ఇచ్చారు. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో వరకట్నం ప్రవేశించింది. భోగిరాజు అదనపు కట్నం తేవాలని భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. తరచూ కొట్టేవాడు. ఆమెను చనిపోయే విధంగా పలు సూటిపోటిగా మాట్లాడేవాడు. భర్త ఆగడాలను భరించలేక గాయత్రి 2016 డిసెంబర్ మూడో తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందింది. గాయత్రి తండ్రి సోమరాజు ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు కేసును దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీనివాస్ నిందితుడికి వివిధ సెక్షన్ల కింద ఏడేళ్ల జైలు శిక్ష, రూ.85 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను వారి చేరువ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు వివరించారు. ఇన్వెస్టిగేషన్, విచారణ దశలో ఉన్న కేసుల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. బాధితులకు నిర్దేశిత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. డివిజన్, మండల స్థాయిల్లో సివిల్ రైట్స్ డేలను నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ, దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహించాలని, బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

స్టే ఉన్న కేసులపై కదలిక తేవాలి : సుమారు ఏడు కేసులపై హైకోర్టు స్టే ఉన్నట్లు పోలీసు అధికారులు తెలపగా.. వాటిలో కదలిక తీసుకొచ్చేందుకు అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు సూచించారు. న్యాయ నిపుణులతో చర్చించి బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్టే కేసుల విషయంలో మరింత చొరవ చూపాలన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో పి.శ్రీలేఖ, డీసీపీలు, ఏసీపీలు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సంతాన' వైద్యం వికటించి మహిళ మృతి

పీఎంపాలెం: సంతాన సాఫల్యం కోసం ఆస్పత్రిలో చేరిన మహిళకు వైద్యం వికటించడంతో మృతి చెందిన ఉదంతం పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ. గుంటూరు జిల్లా రొంపిచెర్ల మండలం విప్పలపల్లి గ్రామానికి చెందిన బొయ్యల్ల నరేష్ దీవీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సుమారు ఆరేళ్ల క్రితం అనురాధతో వివాహం జరిగింది. సంతానం కలగక పోవడంతో కారుషెడ్ కూడలికి సమీపంలోని ఓ ఆస్పత్రిలో కొద్ది నెలలుగా అనురాధ చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా గైనిక్ సమస్య తలెత్తడంతో గురువారం ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు నగరంలో మరో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. కారుషెడ్ కూడలిలోని ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన భార్య మృతి చెందిందని నరేష్ ఆరోపించాడు. బంధువులతో కలిసి ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగాడు. సీఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: చిన్నారిపై లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనంది శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానాను బాధిత బాలికకు ఇవ్వాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అలాగే ఫిర్యాదు చేసిన సకాలంలో స్పందించనందుకు పాఠశాల ప్రిన్సిపాల్‌కు రూ.5,000 జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివీ.. నిందితుడు అలుగంటి పంచన్న కూర్మన్నపాలెంలో ఉంటున్నాడు. నిందితుడు ఓ స్కూల్లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. పాఠశాల బాత్ రూమ్‌ల దగ్గర 9 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె తండ్రి పాఠశాల ప్రిన్సిపాల్ గునిశెట్టి రాజేష్‌కి ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ వాచ్‌మన్ పై చర్యలు తీసుకోకపోవడంతో బాధిత బాలిక తండ్రి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పరిశీలించిన పోలీసులపై భారతీయ శిక్షాస్మృతి 354 (ఎ), పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు పంచ పంచన్నకు ఐదేళ్ల జైలు, జరిమానా విధించారు.

బహిరంగ ప్రకటన/ నోటీసు

మా క్లయింట్లు అయిన విశాఖపట్నం, దసపల్లా హిల్స్, డోర్ నెం. 11-2-6/2రు కాపురస్తులు పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి భార్య **శ్రీమతి శాంత** మరియు పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి కుమారుడు **గోపి కృష్ణ**, పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి కుమార్తె **శ్రీమతి శిరుపూరి కీర్తి** ఏకస్వల్లె పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారికి HDFC Bank లో ఉంచుకున్న సొమ్ము నిమిత్తము సదరు మా క్లయింట్లను వారసులుగా పరిగణిస్తూ Succession Certificate జారీ చేయమని విశాఖపట్నం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు SOP No. 27/2024 దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ ఈనెల **తే.28.10.2024దీ** వాయిదా వేసియున్నారు. కావున ఐందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై వివరించిన మా క్లయింట్ల పేరున Succession Certificate జారీ చేయుటకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్న ఎడల ఈ నెల **తే.28.10.2024దీ గం॥ 10:30 ని॥లకు** విశాఖపట్నం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఖుద్దున గాని న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపగలరు. అటుల అభ్యంతరములు తెలియజేయని యెడల సదరు పైన వివరించిన కోర్టు వారు ఎటువంటి అభ్యంతరములు లేవని యెంచి మా క్లయింట్స్ అయిన విశాఖపట్నం, దసపల్లా హిల్స్, డోర్ నెం. 11-2-6/2రు కాపురస్తులు పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి భార్య శ్రీమతి శాంత మరియు పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి కుమారుడు గోపి కృష్ణ, పెన్మత్స (లేటు) రామచంద్రరాజు గారి కుమార్తె శ్రీమతి శిరుపూరి కీర్తిల పేరున Succession Certificate జారీ చేయగలరు.

శ్రీ డి.రమేష్ & శ్రీ పి.నరసింగరావు,
న్యాయవాదులు, విశాఖపట్నం